సాక్షి
జనగామ
మంగళవారం | 9 | జనవరి | 2024

ఇరిగేషన్ కార్యాలయం వద్ద పోలీస్ పికెట్

- ఫైళ్లు తగులబెడతారనే సమాచారం
- అలర్ట్ అయిన పోలీసులు

ఫ్లాష్.. ఫ్లాష్

జనగామ: జనగామ ఇరిగేషన్ కార్యాలయం (నీటి పారుదల శాఖ) వద్ద ప్రాజెక్ట్‌లు, పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన ఫైళ్లు, రికార్డులను సోమవారం రాత్రి తగులబెడతారనే సమాచారం మేరకు స్థానిక పోలీసులు అలర్ట్ అయ్యారు. ప్రభుత్వ, రాష్ట్ర పోలీస్‌శాఖ ఆదేశం మేరకు జిల్లా కేంద్రంలోని నీటి పారుదల శాఖ కార్యాలయానికి వెళ్లి తనిఖీలు చేశారు. అర్ధరాత్రి 12గంటల నుంచి పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. ఉదయం వరకు ప్రతీరెండు గంటలకొకసారి ఉన్నతాధికారులకు రిపోర్ట్ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసినట్లు పోలీసులు తెలిపారు. ఎస్సై సృజన్ ఆధ్వర్యం లో హెడ్ కానిస్టేబుళ్లు చిలుక శ్రీనివాస్, కుమారస్వామి బందోబస్తు నిర్వహిస్తున్నారు.


ఇరిగేషన్ కార్యాలయం వద్ద పోలీసుల బందోబస్తు

న్యూస్‌రీల్

సర్వాయిపాపన్న విగ్రహం ఏర్పాటు చేయాలి



జనగామ రూరల్: జిల్లా కేంద్రంలో సర్వాయి పాపన్న విగ్రహం ఏర్పాటు చేయాలని, ఇందుకు తక్షణమే జీఓ విడుదల చేయాలని 'గోపా' వ్యవస్థాపక అధ్యక్షుడు కన్నా పర్శరాములు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఏర్పాటు చేసిన కౌడిన్య పరపతి సంఘం సమావేశంలో సంక్షేమ నిధికి పెద్ది వెంకట్ నారాయణ రూ.50 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవసరార్థులైన గౌడ విద్యార్థులను ప్రోత్సహించడానికి సంక్షేమ నిధి ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో 'గోపా' జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, అంబటి రాజయ్య, దూడల రమేష్, ప్రభాకర్, కుమార్, మాధవి, మల్లేష్, శ్రీనివాస్, రాచంద్రం, లక్ష్మయ్య, సుధాకర్, సంపత్, శ్రావన్ పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలకు మైనార్టీ విద్యార్థుల ఎంపిక



జనగామ రూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలకు చెందిన విద్యార్థులు జె.సిద్ధార్థ, రిషిత్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ అనిల్‌బాబు తెలిపారు. గజ్వేల్‌లో ఈనెల 11 నుంచి 18వ తేదీ వరకు జరిగే 49వ జూనియర్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. సోమవారం విద్యార్థులను కళాశాలలో జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి ఇస్మాయిల్‌తో కలిసి అభినందించారు.

జాబ్ మేళాలో 18 మంది ఎంపిక

జనగామ రూరల్: పట్టణంలోని ఏకశిల ఐటీఐ కళాశాలలో సోమవారం నిర్వహించిన జాబ్ మేళాలో 18 మంది నిరుద్యోగ అభ్యర్థులు ప్రైవేట్ సెక్టార్‌లో ఉద్యోగాలకు ఎంపికైనట్లు జిల్లా ఉపాధి అధికారి ఉమారాణి తెలిపారు. వెల్‌స్పెన్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ కంపెనీ సౌజన్యంతో జాబ్ మేళా నిర్వహించామని, ఐటీఐ, ఇంటర్, డిగ్రీ, ఒకేషనల్ కోర్సులు పూర్తిచేసిన 75 మంది పాల్గొన్నట్లు పేర్కొన్నారు. 25 మందికి ఇంటర్వ్యూ నిర్వహించగా 18 మంది అర్హత సాధించనట్లు వివరించారు.

సోమేశ్వరాలయంలో టెండర్లకు ఆహ్వానం

పాలకుర్తి టౌన్: శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో 2024 సంవత్సరానికి పలు సామగ్రి సరఫరా చేయడానికి ఈనెల 11న సీల్డు టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు ఈఓ లక్ష్మీప్రసన్న ఒక ప్రకటనలో తెలిపారు. స్వామివారి పేరున జ్యూట్ బ్యాగ్‌తో పూజా సామగ్రి సరఫరాకు రూ.10వేలు, తడకల పందిళ్లు, క్యూలైన్ ఏర్పాటు, స్వామి వారి శేషవస్త్రాల సరఫరా, మహాశివరాత్రి ఇతర పర్వదినాల్లో పూల అలంకరణ, లైటింగ్ డెకరేషన్, టికెట్ బుక్స్ ఇతర ప్రింటింగ్ పనులు, రంగులు, సున్నం సరఫరాకు రూ.1000 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 10వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దేవస్థానం కార్యాలయంలో డబ్బులు చెల్లించి షెడ్యూలు పొందాలని, ఈ పైకం వాపసు ఇవ్వబడదని, దేవస్థానం ఖాతాలో జమవుతుందన్నారు.

12 నుంచి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

స్టేషన్‌ఘన్‌పూర్: మండల పరిధి ఛాగల్లులో కడియం ఫౌండేషన్ సహకారంతో స్వాగత్ యూత్ ఆధ్వర్యంలో ఈనెల 12 నుంచి రాష్ట్ర స్థాయి కబడ్డీ క్రీడోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఎమ్మెల్యే కడియం శ్రీహరి హనుమకొండలోని నివాసంలో సోమవారం ఆవిష్కరించారు. అనంతరం కబడ్డీ అసోసియేషన్ జనగామ అధ్యక్షుడు, ఛాగల్లు సర్పంచ్ పోగుల సారంగపాణి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అనుమతి.. కడియం ఫౌండేషన్ సహకారంతో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విజేతకు ప్రథమ బహుమతి కింద రూ.60వేలు, ద్వితీయ రూ.40వేలు, తృతీయ రూ.30వేలు, నాలుగో స్థానం రూ.20వేలు, ఐదవ స్థానం రూ.15వేలు, ఆరవ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.10వేల నగదు పారితోషికం అందజేయనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 99668 68076, 97019 49689, 90102 55898 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో స్వాగత్ యూత్ అధ్యక్షుడు కూన రాజు, సభ్యులు రమేష్, శ్రీకాంత్, జాబు అనిల్, ప్రజేష్, బుర్ర యాకయ్య, ఎండీ.పాషా, ఎస్‌కే.ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ వేగవంతం

- అభయహస్తం పథకాల దరఖాస్తుల అప్‌లోడ్ చకచకా ..
- జిల్లా యంత్రాంగమంతా అదే పనిలో నిమగ్నం
- వచ్చిన దరఖాస్తులు 1.78లక్షలు 824 కంప్యూటర్ల ద్వారా నమోదు
- 40 శాతం పూర్తయిన అప్లికేషన్లు
- ఈనెల 12వ తేదీ వరకు పూర్తికి చర్యలు
- పర్యవేక్షిస్తున్న కలెక్టర్, జిల్లా స్థాయి అధికారులు


క్రీస్తుజ్యోతి కళాశాలలో ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ శివలింగయ్య

జనగామ: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాల అమలుకు శ్రీకారం చుట్టింది. ఇందుకు సంబంధించి డిసెంబర్ 28 నుంచి జనవరి 6 వరకు ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించింది. జిల్లా వ్యాప్తంగా 1.78లక్షల దరఖాస్తులు రాగా.. వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ వేగంగా సాగుతోంది. జిల్లా యంత్రాంగమంతా అదే పనిలో నిమగ్నమయారు. కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య పర్యవేక్షణలో అదనపు కలెక్టర్లు రోహిత్‌సింగ్, పర్మార్ పింకేష్‌కుమార్ ఆధ్వర్యాన జిల్లా స్థాయి ఉన్నతాధికారులు, ఎంపీడీఓ, తహసీల్దార్లు ప్రక్రియను పరిశీలిస్తున్నారు.

824 కంప్యూటర్ల సహాయంతో..

జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి నియోజకవర్గాల పరిధిలో వచ్చిన 1.78లక్షల దరఖాస్తులను ఈనెల 5వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే ప్రక్రియ ప్రారంభించారు. ఇందుకుగాను జిల్లా వ్యాప్తంగా 824 కంప్యూటర్లను ఏర్పాటు చేశారు. అలాగే అంతే మొత్తంలో(70శాతం ప్రభుత్వ ఉద్యోగులు, 30శాతం) ప్రైవేట్ డేటా ఎంట్రీ ఆపరేటర్ల సహాయంతో కంప్యూటరీకరిస్తున్నారు. మండల పరిషత్, తహసీల్దార్, ఐకేపీ, జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కలెక్టరేట్, యశ్వంతాపూర్ క్రీస్తుజ్యోతి ఇంజనీరింగ్ కళాశాల తదితర అవకాశాలు ఉన్న చోట దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ క్రీస్తుజ్యోతి ఇంజనీరింగ్ కళాశాల, ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న కంప్యూటరీకరణను పరిశీలించారు.

12వ తేదీ డెడ్‌లైన్..

జిల్లాలో స్వీకరించిన దరఖాస్తులను ఈనెల 12వ తేదీలోగా ఆన్‌లైన్ అప్‌లోడ్ పూర్తి చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు పనులు జరుగుతున్నాయి. ఇప్పటి వరకు 72వేల పైచిలుకు దరఖాస్తులను ఆన్‌లైన్ చేశారు. మరో నాలుగు రోజుల్లో మిగతావి పూర్తి చేయాల్సి ఉంది. వందశాతం ఆన్‌లైన్ పూర్తి చేసిన వెంటనే స్కీంల వారీగా ఏ పథకానికి ఎన్ని దరఖాస్తులు వచ్చాయనే స్పష్టత రానుంది. దీని ప్రకారం కలెక్టర్ సమగ్ర సమాచారంతో ప్రభుత్వానికి నివేదికను పంపించనున్నారు.

వేగంగా ఆన్‌లైన్ ప్రక్రియ

ఆరు గ్యారంటీ పథకాల కోసం డిసెంబర్ 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ వేగంగా జరుగుతోంది. జిల్లా వ్యాప్తంగా అవకాశం ఉన్న చోట 824 కంప్యూటర్లను ఏర్పాటు చేసి డేటా ఎంట్రీ చేయిస్తున్నాం. 12వ తేదీ వరకు ఈ ప్రక్రియ ముగించుకుని, స్కీంల వారీగా వచ్చిన దరఖాస్తుల వివరాలు, కుటుంబాల సంఖ్యకు సంబంధించిన నివేదికను ప్రభుత్వానికి పంపిస్తాం. ఆన్‌లైన్ ఎంట్రీని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. జాప్యం కాకుండా ఆయా శాఖల ఉన్నతాధికారులకు ప్రత్యేక పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించాం.

- సీహెచ్ శివలింగయ్య, కలెక్టర్

సీఎంఆర్ లక్ష్యాలు పూర్తి చేయాలి

- వీసీలో పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి


వీసీలో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు, ఇతర జిల్లా స్థాయి అధికారులు

జనగామ: వానాకాలం, యాసంగి సీజన్(2022–23)కు సంబంధించి మిల్లర్లకు కేటాయించిన సీఎంఆర్ లక్ష్యాన్ని త్వరగా పూర్తి చేయాలి.. ఇందుకు కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన ముఖ్య కార్యదర్శి శాంతకుమారి, ప్రధాన కార్యదర్శి, పౌర సరఫరాల కమిషనర్ డీఎస్ చౌహాన్‌తో కలిసి ప్రజాపాలన దరఖాస్తులు, కంప్యూటరీకరణ, కస్టం మిల్లింగ్ రైస్(సీఎంఆర్) తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. అనంతరం కలెక్టర్ శివలింగయ్య ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సీఎంఆర్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. జాప్యం లేకుండా సీఎంఆర్ డెలివరీ టార్గెట్ పూర్తి చేయాలని, ఈ మేరకు ఎప్పటికప్పుడు సంబంధిత మిల్లులను తనిఖీ చేయాలని ఆదేశించారు. వీసీ, సమీక్షలో అదనపు కలెక్టర్లు పర్మార్ పింకేశ్‌కుమార్, సుహాసిని, డీసీఎస్‌ఓ రోజారాణి, సివిల్ సప్లయీస్ డీఎం టీఎస్‌ఎస్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మేలు చేయడమే ప్రభుత్వ ధ్యేయం

- తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్


ఎస్సారెస్పీ నీటిని విడుదల చేసి గంగమ్మకు నమస్కరిస్తున్న ఎమ్మెల్యే సామేల్ తదితరులు

కొడకండ్ల : రైతులకు మేలు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని బయ్యన్నవాగు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ అవుట్‌ఫ్లో గేట్లను ఎత్తి శ్రీరాంసాగర్ నీటిని ఎమ్మెల్యే విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బయ్యన్నవాగు రిజర్వాయర్ ద్వారా తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని 69వేలు, సూర్యాపేట నియోజకవర్గంలో 75వేలు, కోదాడ నియోజకవర్గంలో 25వేల ఎకరాలకు సాగు నీరు అందుతుందని చెప్పారు. వాటాబందీ ప్రకారం మార్చి చివరి వరకు సాగు నీటిని విడుదల చేస్తామని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పంచవర్ష ప్రణాళికల్లో భాగంగా రైతుల శ్రేయస్సు కోసం సాగునీటి ప్రాజెక్టులు నిర్మించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సారెస్పీ ఈఈ విజయ్‌కుమార్, డీఈ సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, స్థానిక ఎంపీటీసీ యాకయ్య, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి


ముద్ర రుణ పత్రాలు ఇస్తున్న ఎమ్మెల్యే కడియం

రఘునాథపల్లి: మహిళలు ఆర్థికంగా మరింత అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ అన్నారు. మండలగూడెంలో సోమవారం ముదిరాజ్ మహిళలకు ముద్ర బ్యాంక్ లోన్ పత్రాలను అందజేసిన అనంతరం బ్యాంక్ మేనేజర్ చంద్రశేఖర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గ్రామీణ ప్రాంత మహిళలను ఆర్థికంగా ఆదుకోడానికి తక్కువ వడ్డీతో రుణాలు ఇవ్వడం అభినందనీయమని, రానున్న రోజుల్లో మహిళలు లబ్ధిపొందేలా మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. ముదిరాజ్ మహిళలకు కమిటీ హాల్ మంజూరు చేస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సమావేశంలో సర్పంచ్ ఉమారాణిసత్యనారాయణ, భిక్షపతి, మారజోడు రాంబాబు, కుమార్‌గౌడ్, లక్ష్మయ్య, తీగల కరుణాకర్, రవి, సునీత, మధు, కిరణ్, వారాల రమేష్, శివప్రసాద్, కుమార్, సదానందం, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లూయిస్ బ్రెయిలీ సేవలు మరువలేనివి

- అదనపు కలెక్టర్ సుహాసిని


కార్యక్రమంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సుహాసిని

జనగామ రూరల్: అంధుల లిపి సృష్టికర్త లూయిస్ బ్రెయిలీ సేవలు మరువలేనివని అదనపు కలెక్టర్ సుహాసిని అన్నారు. బ్రెయిలీ జయంతి సందర్భంగా సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా సంక్షేమాధికారి జయంతి ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. చూపు లేదని చింతించొద్దని, మనోనేత్రంతో చూసే అంధులు ఎంతో గొప్పవారని పేర్కొన్నారు. కంటిచూపు లేనివారిని తక్కువ చేసి చూడకూడదని, సమాజంలో అందరితోపాటు గౌరవించాలని కోరారు. అంధులకు ఇందిరమ్మ ఇండ్లు, బ్యాక్‌లాగ్ పోస్టులు, ఉచిత ప్రయాణం, రూ.5 లక్షల ప్రోత్సాహకాలు వంటి వాటిని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. అనంతరం కేక్ కట్ చేసి అంధుల క్యాలెండర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో అంధుల కమిటీ అధ్యక్షుడు ఎ.కుమార్, డి.ఉదయ్‌కేతన్, డీఎంహెచ్‌ఓ ప్రశాంత్, డీపీఎం వినీత తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు బానిస కావొద్దు

- జనగామ డీసీపీ సీతారాం


సదస్సులో మాట్లాడుతున్న డీసీపీ సీతారాం

స్టేషన్‌ఘన్‌పూర్: యువత మాదకద్రవ్యాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని జనగామ డీసీపీ సీతారాం అన్నారు. మండల పరిధిలో మాదకద్రవ్యాలకు అలవాటుపడిన వారికి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాలు తీసుకోవడం వల్ల కలిగే అనర్థాలు, వాటికి అలవాటు పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన అవగాహన కల్పించారు. యువత తమకు తెలియకుండానే చెడు స్నేహాలతో డ్రగ్స్‌కు అలవాటుపడుతున్నారని, బానిస కాకముందే తప్పును తెలుసుకుని సన్మార్గంలో నడవాలని సూచించారు. ఖాళీగా ఉండకుండా ఏదైనా పని చేయడంతోపాటు క్రీడలు, యోగా, వ్యాయామం తదితర వ్యాపకాలపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలు విక్రయించే ప్రదేశాలు, వ్యక్తులు, తరలించే వాహనాల గురించి పోలీసులకు సమాచారం అందించి డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు సహకరించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ శ్రీనివాసరావు, సీఐ రాజు, ఎస్‌ఐ నాగరాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల పురోగతికి పాటుపడదాం

- జిల్లా విద్యాధికారి కె.రాము

దేవరుప్పుల: ప్రభుత్వ పాఠశాలల పురోగతికి పాటుపడదామని డీఈఓ రాము పిలుపునిచ్చారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో పీఆర్‌టీయూ, ఆర్‌యూపీటీటీఎస్ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌లను తహసీల్దార్ హుస్సేన్, ఈసేవ జిల్లా మేనేజర్ దుర్గారావుతో కలిసి వేర్వేరుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ, రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ తెలంగాణ రాష్ట్ర ప్రతినిధులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యల పరిష్కారానికి శాఖపరంగా కృషి చేయాలని కోరారు. ఈ విషయమై డీఈఓ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో పాఠశాలల స్థితిగతులు, ఉపాధ్యాయుల సమస్యలపై వాస్తవిక నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని చెప్పారు. అనంతరం స్థానిక ప్రాథమిక పాఠశాలను డీఈఓ తనిఖీ చేసి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఆయా ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు అంబటి అంజయ్య, ములుకనూరి శంకర్, బెజ్జం సునీల్ కుమార్, ప్రభాకర్‌రెడ్డి, కళావతి, రజిత, చెకిలాల శ్రీనివాస్ విజయ్‌పాల్‌రెడ్డి, విజయ, నిహారిక, రమాదేవి, చంద్రకళ, హరిప్రసాద్, కృష్ణ, భీమా, రాజు తదితరులు పాల్గొన్నారు.


క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న డీఈఓ తదితరులు

'జెండా పాట' జోష్.. ఆ తర్వాత ఖల్లాస్

- ఏనుమాముల మార్కెట్‌లో మిర్చి రైతుల ఆందోళన
- అత్యధిక ధర చెల్లించేది ఒకరిద్దరు రైతులకే
- రేట్లు తగ్గించి దోపిడీ చేస్తున్నారని విమర్శలు
- ధర్నాతో తెరపైకి మోసం దందా
- మార్కెట్ అధికారులు చొరవ చూపాలంటున్న రైతులు


యార్డు నుంచి ఆందోళన వ్యక్తం చేస్తూ రోడ్డు పైకి వస్తున్న రైతులు

సాక్షి, వరంగల్: వరంగల్ ఏనుమాముల మార్కెట్‌లో మిర్చి కొనుగోళ్లకు సాగే జెండా పాట వినగానే రైతుల్లో ఒక్కసారిగా జోష్ వస్తోంది.. ఆ తర్వాత మార్కెట్ యార్డులో మిర్చి కొనుగోళ్లు మొదలయ్యాక అంతలోనే నిరాసక్తత కనిపిస్తోంది. ఫలితంగా అప్పుడప్పుడూ రైతులు ఆందోళనకు దిగుతున్న సందర్భాలుంటున్నాయి. ఈ విధంగానే సోమవారం జరిగిన జెండా పాటలో తేజ మిర్చి క్వింటాల్‌కు రూ.20,100లు పలుకగా, దాదాపు అదే నాణ్యతతో ఉన్న మిర్చికి రూ.14వేల నుంచి రూ.17వేలు, తక్కువ నాణ్యత ఉన్న మిర్చికి రూ.12వేల నుంచి రూ.13 వేలు చెల్లిస్తామని చెప్పడంతో గొడవ మొదలైంది. ఏకంగా రూ.8వేల వరకు ధర తగ్గించడమేంటని రైతులు ఆగ్రహంతో మార్కెట్‌లోనే ఆందోళనకు దిగారు. అయితే ఈ తరహా దోపిడీ రోజూ జరుగుతున్నా జెండా పాటకు కాస్త రూ.2వేల నుంచి రూ.3వేలు తక్కువగా ఉండడంతో జరిగే గలాటా బయటకు వచ్చే సందర్భాలు చాలా తక్కువే. మిర్చి కొనుగోళ్ల ధరలో సోమవారం భారీ వ్యత్యాసాలు ఉండడంతో రైతులు ఆందోళన వరకు వెళ్లారు.

వాళ్లు చెప్పిందే నాణ్యత..

వరంగల్‌లోని ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి రైతులు తమ పంట ఉత్పత్తులు తీసుకొస్తున్నారు. ఇక్కడ పంటకు ఎక్కువ ధర పలుకుతుందని వచ్చే రైతుల ఆశలపై వ్యాపారులు, అధికారులు నీళ్లు చల్లుతున్నారు. మార్కెట్‌లో మిర్చి ధరలను నిర్ణయించేందుకు రోజు మార్కెట్ అధికారుల పర్యవేక్షణలో రైతులు, అడ్తిదారులు, కొనుగోలుదారుల సమక్షంలో జెండా పాట నిర్వహిస్తున్నారు. ఈ పాటలో రైతులు తెచ్చిన సరుకు నాణ్యత పరిశీలించిన ట్రేడర్లు పాల్గొని ధరలు పెంచుతారు. ఫైనల్ ధరను ఆరోజు మార్కెట్‌లో ఆ రకం మిర్చి గరిష్ట ధరలను ప్రకటిస్తారు. ఆ తర్వాతనే పాట ఆధారంగా కొనుగోళ్లు జరుగుతాయి. అయితే గరిష్ట ధర రైతులందరికీ చెల్లిస్తారా అంటే అదీ లేదు. ఒకరిద్దరు రైతులకు చెల్లించి మమ అనిపిస్తున్నారనే విమర్శలున్నాయి. అడ్తి వ్యాపారులు, ఖరీదుదారులు సిండికేట్‌గా మారి రైతులు తీసుకొచ్చిన పంట నాణ్యతను పట్టించుకోకుండా కేవలం ధనార్జనే ధ్యేయంగా ధర నిర్ణయిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. మార్కెట్ అధికారుల ఉదాసీనతతోనే వ్యాపారులు రైతులను దగా చేస్తున్నారని చెప్పుకుంటున్నారు.

ఆందోళనతో దిగొచ్చారు..

మార్కెట్‌లో మిర్చి కొనుగోళ్లు సుమారు నాలుగు గంటల పాటు నిలిచిపోయాయి. జెండా పాట కంటే రూ.8 వేలు తక్కువ చెల్లిస్తామని అడ్తిదారులు, కొనుగోలుదారులు చెప్పడంతో రైతులు విక్రయాలను నిలిపివేసి ధర్నా బాట చేశారు. మార్కెటింగ్, పోలీసు అధికారులు, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, రైతుల మధ్య రెండు గంటల పాటు చర్చలు జరిగాయి. చివరకు ప్రతీ లాట్ వద్దకు వచ్చి పరిశీలించి ధరలు నిర్ణయిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు కాంటా వద్దకు వెళ్లారు. తేజ క్వింటాకు రూ.16,500పైనే ధర చెల్లించారు. ఈ చర్చల్లో మార్కెట్ జేడీఎం మల్లేశం, డీఎంఓ ప్రసాదరావు, మామునూరు ఏసీపీ సతీష్‌బాబు, కార్యదర్శి సంగయ్య, చాంబర్ అధ్యక్ష, కార్యదర్శులు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, వేద ప్రకాశ్, సంపత్, ఏనుమాముల సీఐ మహేందర్, ఎస్‌ఐ రాజన్‌బాబు, గ్రేడ్–2 కార్యదర్శులు బియాబానీ, రాము పాల్గొన్నారు.

అంతా కుమ్మక్కయ్యారు..



తేజ క్వింటాకు జెండా పాట రూ.20,100కు ఫైనల్ ధర అయింది. ఈ ధరలు చెల్లించకుండా రూ.6వేల నుంచి రూ. 8 వేలు తగ్గించి అడుగుతున్నారు. వారం క్రితం తేజ క్వింటాకు రూ.23,500లు ధర పలికింది. అధికారులు పట్టించుకోలేదు. అందుకే రోడ్డుపైకి ఎక్కాము. - వాంకుడోత్ దేవేందర్, కలకత్తాతండా, మహబూబాబాద్


సేవారత్న నేషనల్ అవార్డుకు సతీష్ ఎంపిక


సతీష్‌కు ఆహ్వాన పత్రం ఇస్తున్న రాధాకృష్ణ

స్టేషన్‌ఘన్‌పూర్: బహుజన సాహిత్య అకాడమీ ప్రతీ ఏడాది అందించే సేవారత్న నేషనల్ అవార్డు–2024 కు స్టేషన్‌ఘన్‌పూర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ వరంగల్ వెస్ట్ ఇన్‌చార్జ్ కొలిపాక సతీష్ ఎంపికైనట్లు బీఎస్‌ఏ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. సతీష్ తన తల్లి సరోజన జ్ఞాపకార్థం, దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి, వర్ధంతి సందర్భంగా చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు, కరోనా సమయంలో చేసిన సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఫిబ్రవరి 11న తిరుపతిలో జరిగే కార్యక్రమంలో అవార్డు అందిస్తారని వివరించారు. ఈ మేరకు అవార్డు ఎంపిక ఆహ్వాన పత్రాన్ని హైదరాబాద్‌లోని బీఎస్‌ఏ జాతీయ కార్యాలయంలో సతీష్‌కు సోమవారం అందజేశారు. రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్, కోఆర్డినేటర్ విష్ణు, ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, సెలక్షన్ కమిటీ అధ్యక్షుడు టి.ఐలయ్య, డాక్టర్ విజయలలిత, నాయీబ్రాహ్మణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సమ్మయ్య పాల్గొన్నారు.

తల్లులకు నీడనిచ్చే అవకాశం రావడం సంతోషం

- రూ.13 కోట్లతో వృద్ధాశ్రమ నిర్మాణం
- ఈ నెలాఖరు నాటికి ప్రారంభిస్తాం..
- ఎమర్జెన్సీ వార్డు.. షిఫ్టుల వారీగా వైద్యుల పర్యవేక్షణ
- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెల్లడి


ఆశ్రమం ప్రారంభోత్సవం గురించి కొమ్మూరితో చర్చిస్తున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి

జనగామ: అనాథ వృద్ధ తల్లులకు నీడనిచ్చే అవకాశం రావడం సంతోషంగా ఉందని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. జనగామ మండలం శామీర్‌పేటలో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి తన తల్లి కోమటిరెడ్డి సుశీలమ్మ జ్ఞాపకార్థం రూ.13 కోట్లతో నిర్మించిన అనాథ వృద్ధాశ్రమాన్ని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డితో కలిసి రాజగోపాల్‌రెడ్డి సోమవారం సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రుద్రమదేవీ మహిళా సొసైటీ ప్రతినిధుల విజ్ఞప్తి మేరకు వృద్ధాశ్రమం నిర్మించేందుకు ముందుకు వచ్చినట్లు చెప్పారు. కరోనా కారణంగా కొంత ఆలస్యం అయినా.. ఈ నెలాఖరున ప్రారంభిస్తామన్నారు. ఆశ్రమంలో 126 మంది వృద్ధులకు అవకాశం ఉందని, ఎమర్జెన్సీ వార్డు కూడా ఉంటుందని, షిఫ్టుల వారీగా వైద్యుల పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. నిర్వహణలో ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వంతో కలిసి ముందుకు వెళ్లేలా ప్రయత్నం చేస్తామని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో వృద్ధాశ్రమం ఏర్పాటు చేయాలని సర్కారు కూడా ఆలోచన చేస్తున్నదని, అది కార్యరూపం దాల్చితే మరింత సక్సెస్ అయ్యే అవకాశం ఉంటుందన్నారు. తన భార్య లక్ష్మి ఆశ్రమ చైర్మన్‌గా నిరంతరం పర్యవేక్షిస్తారని చెప్పారు. జీవిత చివరి దశలో ఎవరి ఆదరణ లేకుండా ఇబ్బంది పడే వృద్ధులు, అనాథ మహిళలకు పార్టీలు, రాజకీయాలకు అతీతంగా సొంతింటి ప్రేమను పంచాలని ఆకాంక్షించారు. డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ మానవ సేవ మాధవ సేవగా భావించి అనాథాశ్రమం నిర్మాణం చేపట్టారని పేర్కొన్నారు. రుద్రమదేవి సొసైటీ ఫౌండర్ సుశీలమ్మ మాట్లాడుతూ.. ఒక్క రూపాయి కూడా ఆశించకుండా సేవ చేసే వారికి దేవుడి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. కార్యక్రమంలో నాయకులు వేమెళ్ల సత్యనారాయణరెడ్డి, ఎర్రమల్ల సుధాకర్, సుంకరి శ్రీనివాస్‌రెడ్డి, కంచె రాములు, మేడ శ్రీనివాస్, గాదెపాక రాంచందర్, వంగాల కల్యాణి మల్లారెడ్డి, ఆలేటి సిద్దిరాములు, అజహరొద్దీన్, రాందయాకర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, తొట్టె కృష్ణ, శ్రీధర్‌రెడ్డి, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డాక్టర్ సైఫ్ సస్పెన్షన్ యధాతథం

- హైకోర్టు ఉత్తర్వులతో మరోసారి విచారించిన యాంటీ ర్యాగింగ్ కమిటీ
- కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్

ఎంజీఎం : డాక్టర్ ప్రీతిని ర్యాగింగ్ చేసి ఆమె ఆత్మహత్యకు కారణమైన డాక్టర్ సైఫ్‌పై విధించిన సస్పెన్షన్‌ను పరిశీలించాలని హైకోర్టు అదేశాలతో మరోసారి విచారణ జరిపిన యాంటీ ర్యాగింగ్ కమిటీ అతని సస్పెన్షన్‌ను యధావిధిగా కొనసాగించేందుకు నిర్ణయం తీసుకుంది. వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీలో అనస్తీషియా పీజీ రెండో సంవత్సరం అభ్యసిస్తున్న డాక్టర్ సైఫ్.. మొదటి సంవత్సరం పీజీ విద్యార్థిని డాక్టర్ ప్రీతిని మానసికంగా వేధించినట్లు యాంటీ ర్యాగింగ్ కమిటీ నిర్ధారణకు వచ్చి ఏడాదిపాటు సస్పెన్షన్ విధించిన విషయం తెలిసిందే. డాక్టర్ సైఫ్ తన సస్పెన్షన్‌ను సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించి పునర్విచారణ చేయాలని కోరాడు. మరోసారి విచారణ చేయాలని కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్‌ను హైకోర్టు ఆదేశించింది. కోర్టు ఆదేశాల మేరకు ప్రిన్సిపాల్ డిసెంబర్ 9వ తేదీన యాంటీ ర్యాగింగ్ కమిటీ సమావేశం ఏర్పాటు చేసి డాక్టర్ సైఫ్‌ను అతని లాయర్ సమక్షంలో ఎన్ఎంసీ మార్గదర్శకాల ప్రకారం సుదీర్ఘంగా విచారణ జరిపారు. ఈ సందర్భంగా సైఫ్‌పై వచ్చిన ఆరోపణలు వాస్తవమేమని యాంటీ ర్యాగింగ్ కమిటీ మరోమారు నిర్ధారించి అతనిపై విధించిన సంవత్సరం కాలం సస్పెన్షన్ కొనసాగుతుందని నిర్ణయించింది. కాగా కోర్టు ఆదేశాలతో సస్పెన్షన్ సమయంలో అతను హాజరైన 97 రోజుల కాలాన్ని పొడిగిస్తూ అతని సస్పెన్షన్‌ను ఈ ఏడాది జూన్ 8 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్ స్పష్టం చేశారు.

రైల్వే ఉద్యోగి ఆత్మహత్య


నాగరాజు(ఫైల్)

కాశిబుగ్గ : రైలు కింద పడి ఓ రైల్వే ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్న ఘటన నెక్కొండ రైల్వే స్టేషన్‌లో సోమవారం చోటుచేసుకుంది. జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం వరంగల్ జిల్లా నెక్కొండకు చెందిన సందబోయిన నాగరాజు(50) నెక్కొండ రైల్వే స్టేషన్ పరిధిలో పాయింట్ మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. అయితే కొన్ని రోజులుగా విధులకు అతను హాజరు కావడం లేదు. కారణాలు ఏంటో తెలియదు కానీ డౌన్ లూప్‌లైన్‌లో వెళ్తున్న కృష్ణా ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో శరీరం రెండు ముక్కలై అక్కడికక్కడే మృతి చెందాడు. డిప్యూటీ ఎస్ఎస్ ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ జి.సుదర్శన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహనికి పోస్ట్‌మార్టం నిర్వహించి మృతుడి కుమారుడు యశ్వంత్‌కు అప్పగించామని సీఐ తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తెలు ఉన్నారు.

మనస్తాపంతో మహిళ..


నాగమణి(ఫైల్)

మంగపేట : మండలంలోని రాజుపేటకు చెందిన వంగపండు నాగమణి(26) ఫైనాన్స్ కంపెనీ వాళ్లు ఇంటికి వచ్చి పొక్లెయినర్ తీసుకువెళ్లడంతో అవమానంగా భావించి మనస్తాపం చెంది పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు..ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని బొబ్బిలి ప్రాంతానికి చెందిన వంగపండు సత్తిబాబు పొక్లెయినర్ డ్రైవర్‌గా ఉపాధికోసం ఐదేళ్ల క్రితం రాజుపేటకు వచ్చి అద్దె ఇంట్లో భార్య నాగమణితో ఉంటున్నాడు. గతేడాది ఫైనాన్స్‌లో పొక్లెయినర్ కొనుగోలు చేశాడు. కొంతకాలంగా నెలవారిగా చెల్లించాల్సిన కిస్తీలు చెల్లించక పోవడంతో ఫైనాన్స్ ఏజెంట్లు సోమవారం ఇంటికి వచ్చి బకాయి డబ్బులు చెల్లించలేదని తమ నిబంధనల మేరకు ముందుగా పొక్లెయినర్ తీసుకువెళ్తామని ఒత్తిడి చేశారు. ఎంత చెప్పినా వినకుండా పొక్లెయినర్ తీసుకు వెళ్లడంతో అవమానంగా భావించిన సత్తిపండు భార్య నాగమణి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలికి భర్త, కూతురుఉంది.



ఫ్రెండ్ రిక్వెస్ట్.. తప్పదు మూల్యం

కొంపముంచుతున్న కొత్త స్నేహాలు

- ఇంటర్‌నెట్ వాడకంలో అప్రమత్తత అవసరం
- నకిలీ ఖాతాలకు చోటివ్వొద్దు



➡ వరంగల్ నగరంలో బ్యూటీషియన్‌గా పనిచేస్తున్న వివాహితకు ఫేస్‌బుక్ ద్వారా ఓ యువకుడు పరిచయమయ్యాడు. ఆ పరిచయమే చివరకు భర్తతో పాటు ఆమె మృతికి కారణమైంది. ఎంతో భవిష్యత్ ఉన్న రెండు జీవితాలు అర్థాంతరంగా ముగిసిపోయాయి.

➡ ఓ యువకుడు ఏకంగా 80 నకిలీ ఫేస్‌బుక్ ఖాతాలను సృష్టించి పలువురు యువతులను ముప్పుతిప్పలు పెట్టాడు. ఆఖరికి ఓ యువతి ధైర్యం చేసి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆ ఆకతాయి గుట్టురట్టయ్యింది.

కాజీపేట: సామాజిక మాధ్యమాలు.. కొత్త స్నేహాన్ని చిగురింపజేసే వేదికలు. మనకు తెలియని వ్యక్తులు స్నేహం చేసేందుకు(ఫ్రెండ్ రిక్వెస్ట్) అభ్యర్థనలు పంపుతుంటారు. అలా అని తొందరపడి యాక్సెప్ట్ చేశారో ఇరుకున పడే ప్రమాదముంది. అందుకే అపరిచితుల అభ్యర్థనలను సాధ్యమైనంత వరకు ఆమోదించకపోవడం మేలు. వారితో మనకు ముఖ పరిచయాలు లేకపోవడంతో ఒకటికి రెండుసార్లు వారి ప్రొఫైల్స్‌ను పరిశీలించి అభ్యర్థనను అంగీకరిస్తే మేలు.

అమ్మాయిల పేర్లతో.. అబ్బాయిలు

సాంకేతిక పరిజ్ఞానం విస్తృతమవుతున్న కొద్దీ అపరిచితులు తెలివి మీరుతున్నారు. కొందరు యువకులే అమ్మాయిల పేర్లతో ఏకంగా నకిలీ ఖాతాలను తెరుస్తున్నారు. చాటింగులో తియ్యగా మాట్లాడి క్రమంగా ప్రలోభానికి గురిచేస్తారు. ఈ విషయాన్ని ఎదుటివారు తొందరగా గుర్తించకపోతే బ్యాంకు ఖాతా, పిన్ నంబర్లు బయటకు చెప్పేలా చేస్తారు. సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహనలేని వారు మాత్రమే కాదు ప్రభుత్వ ఉద్యోగులు, చదువుకున్న వారు సైతం వీరి బారిన పడి ఆర్థికంగా మోసపోతున్నారు. కొత్తగా పరిచయమైన వారితో వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విషయాలను ఏ మాత్రం పంచుకోకూడదు.

పెరుగుతున్న సైబర్ నేరాలు

మారుతున్న సాంకేతిక రంగంలో సామాజిక మాధ్యమాల హవా మితిమీరిపోతున్నాయి. చిన్న, పెద్ద తేడా లేకుండా ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విట్టర్(ఎక్స్), ఇన్‌స్టా ఖాతాదారులే. వీటి ద్వారా మరుగున పడిన స్నేహబంధాలను పునరుద్ధరించడమే కాకుండా కొత్త వ్యక్తుల పరిచయానికి బీజం వేస్తున్నాయి. ఇంతవరకు బాగానే ఉన్నా అప్రమత్తంగా లేకపోతే అదే స్థాయిలో అవస్థలు తెచ్చిపెడుతున్నాయి. దీంతో సైబర్ నేరాల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది.

ప్రతి ఐదు కుటుంబాల్లో నలుగురు ఇంటర్‌నెట్ వాడుతున్నారు. సుమారు 38లక్షల మందికిపైగా వివిధ రకాల ఇంటర్‌నెట్ ఉన్న సెల్‌ఫోన్లు వినియోగిస్తున్నారు. వీటి వాడకంలో యువత పాత్ర ప్రధానమైంది. సామాజిక మాధ్యమాల్లో చురుగ్గా వ్యవహరించే వారు 78శాతం, రోజూ కనీసం ఆరుసార్లు ఈ ఖాతాలను తెరిచి స్పందించే వారు 56 శాతం, కొత్త యాప్స్‌ను స్వాగతించే వారు 38శాతం మంది ఉన్నారని నిపుణుల అంచనా.

ఇంటర్ నుంచి పీజీ, ఇతర కోర్సులు చదువుతున్న యువత 3 లక్షల మంది వరకు ఉంటారు. 16–30 ఏళ్ల వయసు కలిగిన యువత రోజుకు 2:15 గంటలపైనే సెల్‌ఫోన్ వాడుతున్నట్లు పలు నివేదికలు చెబుతున్నాయి.

అదో అద్భుతం.. వెంటనే దుర్భరం..

వాస్తవానికి ఇంటర్‌నెట్ ఓ అద్భుతం. అందులో జ్ఞానాన్ని గ్రహించిన వారికి బంగారు భవిష్యత్ దర్శనమిస్తుంది. కానీ ఇదే మళ్లీ చెడు ప్రభావానికి కారణమవుతుంది. స్వార్థానికి, వ్యసనాలకు వినియోగించే వారు అవస్థల పాలవుతున్నారు. మోసాలకు, అక్రమార్జనకు తెర లేపేవారు ఆలస్యంగా కటకటాలు లెక్కిస్తున్నారు. అవగాహన లేకుండా అమాయకంగా ఖాతా తెరిచి కొంతమంది విసిరే వలలో చిక్కి బలి పశువులవుతున్నారు.

స్వీయ నియంత్రణ అవసరం



సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడంలో వాట్సాప్, ఫేస్‌బుక్‌ల పాత్ర ఎక్కువైంది. విదేశాల్లో ఉన్న తల్లిదండ్రులు, స్నేహితులతో సందేశాల ద్వారా మాట్లాడుకునేందుకు పరిమితం చేయాలి. పనికిరాని కబుర్లు చెబుతూ విద్యార్థులు, మహిళలను ఆకర్షించేందుకు వీటిని వాడితే చర్యలు తప్పవు. అపరిచిత వ్యక్తుల పట్ల కఠినంగా ఉండాల్సిందే. లేదంటే మోసపోవడం ఖాయం. ఆ తర్వాత బాధపడిన ప్రయోజనం ఉండదు.

– డేవిడ్ రాజ్, ఏసీపీ, కాజీపేట

గేమ్స్‌తో కామ్‌గా..

క్యాండీక్రష్, ఫార్మ్‌విల్లే తదితర ఆటల కోసం అభ్యర్థనలు అధికంగా వస్తుంటాయి. ఒకవేళ మీకు వారితో ఆడాలనిపిస్తే యాక్సెస్‌ను ఇచ్చేటప్పుడు మీ ప్రొఫైల్‌కు సంబంధించిన నియమాలు పాటించండి.ఆట పేరుతో పరిచయమైన వారికి అక్కడితో పరిమితం చేయాలి. మీ ఖాతా పాస్‌వర్డ్ ఎవరితోనూ పంచుకోకూడదు. ఎప్పటికప్పుడు పాస్‌వర్డ్ మారుస్తూ ఉండాలి. ఎక్కువగా సోషల్ మీడియాను వినియోగించే పిల్లలను తల్లిదండ్రులు అప్పుడప్పుడు కనిపెడుతూ ఉండాలి. ఒకవేళ ఏదైనా జరగరానిది జరిగితే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలి.

అప్రమత్తంగా ఉండాల్సిందే..



ఆధునిక కాలంలో ఇంటర్‌నెట్ అవసరమే. అయినా తగు జాగ్రత్తలు తీసుకోవాలి.అవసరం మేరకే సామాజిక మాధ్యమాలను వినియోగిస్తే అన్ని విధాలా మంచిది. గుర్తు తెలియని వారు ఫేస్‌బుక్ ఖాతాకు అభ్యర్థన పంపినా ఏ మాత్రం స్పందించను. పదే పదే అభ్యర్థనను తిరస్కరించడంతో విసుగు చెంది ఆ ప్రయత్నాన్ని వారే విరమించుకుంటారు.

– బండారి సురేందర్

యువత ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి

- సినీ దర్శకుడు సందీప్‌రెడ్డి


సందీప్‌రెడ్డిని సన్మానిస్తున్న యూత్‌సభ్యులు

దంతాలపల్లి : యువత ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని అర్జున్‌రెడ్డి, ఎనిమల్స్ చిత్ర దర్శకుడు వంగ సందీప్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని తన నానమ్మ సంవత్సరికం కార్యక్రమానికి వచ్చిన సందీప్‌రెడ్డికి యూత్ ఆధ్వర్యంలో గ్రామ యువకులు పుష్పగుచ్చం అందించి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు గ్రామంలో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి సాయం చేయాలని కోరారు. స్పందించిన సందీప్ రెడ్డి మూడు రోజుల్లో స్టేడియంకు అయ్యే ఖర్చు చెబితే, ఇస్తానని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత ఉన్నత లక్ష్యాలతో పాటు, క్రీడల్లో ముందుకు సాగలన్నారు. కార్యాక్రమంలో ఎంపీటీసీ నెమ్మది యాకయ్య, శ్రీను, విజయ్, ముత్తు, శేఖర్, సోమేష్, నరేందర్, సందీప్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

కేయూ ఆడిట్ ఆఫీసర్‌గా శ్రీలత

కేయూ క్యాంపస్: కేయూలోని ప్రీ ఆడిట్ విభాగంలో ఆడిట్ ఆఫీసర్‌గా శ్రీలత నియమితులయ్యారు. ఈ మేరకు కేయూ రిజిస్ట్రార్ టి.శ్రీనివాస్‌రావు సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఆడిట్ ఆఫీసర్ అయిన అసిస్టెంట్ రిజిస్ట్రార్ కిష్టయ్య ఏసీబీకి పట్టుబడిన నేపథ్యంలో.. అతడిని సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో అకౌంట్స్ విభాగంలోని అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీలతను నియమించారు. కాగా, అంతకుముందు పరీక్షల నియంత్రణ విభాగంలో డిగ్రీ సెక్షన్‌లో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న రామును నియమించారు. కానీ ఆయన విధుల్లో చేరేందుకు సుముఖత చూపలేదు. బిల్లుల విషయంలో తేడా ఉందని, అందుకే విముఖత చూపినట్లు తెలుస్తోంది.

బిల్ట్ పునరుద్ధరణపై సీఎం దృష్టి


హైదరాబాద్‌లో ఫిన్‌క్విస్ట్ సంస్థ ప్రతినిధులతో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

- ఫిన్‌క్విస్ట్, ఐటీసీ సంస్థలతో సమీక్ష
- మంత్రి సీతక్క కృషిపై హర్షం

మంగపేట : ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఏజెన్సీకీ తలమానికంగా నిలిచిన కమలాపురం బిల్ట్ కర్మాగారం 2014 నుంచి మూతపడిన విషయం విదితమే. బిల్ట్ సమస్యపై పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క ప్రత్యేక చొరవతో ఫ్యాక్టరీని పునరుద్ధరించే విషయంపై ఫిన్‌క్విస్ట్ సంస్థ, ఐటీసీ కంపెనీ ఆధ్వర్యంలో సోమవారం ఆయా కంపెనీల యజమాన్యం, ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఎన్‌సీఎల్‌టీ నిబంధనల మేరకు రాష్ట్రంలో బిల్ట్ ఆస్తులను పొందిన ఫైనాన్సియల్ సొల్యూషన్ ప్రైవేటు లిమిటెడ్ (ఫిన్‌క్విస్ట్) ఎండి హార్దిక్ పటేల్‌తో ముఖ్యమంత్రి హైదరాబాద్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మూతపడిన ఫ్యాక్టరీని సులభతరంగా పునరుద్ధరించానే బలమైన ఉద్దేశాన్ని సీఎం వ్యక్తం చేశారు. అదే విధంగా ఐటీసీ, పీఎస్‌పీడీ (పేపర్ బోర్డులు, స్పెషాలిటీ పేపర్స్ విభాగం)కు చెందిన సీఈఓ వాదిరాజ్ కులకర్ణితో తెలంగాణలో కొనసాగుతున్న ప్రాజెక్టులు, భవిష్యత్ విస్తరణ ప్రణాళికలపై చర్చించారు. బిల్ట్ ఆస్తులను కొనుగోలు చేసేందుకు ఫిన్‌క్విస్ట్‌తో చర్చలు జరుపుతున్న ఐటీసీ కంపెనీకి కమలాపురంలో బిల్ట్ కర్మాగారం పునరుద్ధరించేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తుందని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. సమావేశంలో పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క, మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి(ఇండస్ట్రీస్) సింధు పాల్గొన్నారు.

మంత్రి సీతక్క కృషిపై హర్షం

వేలాది మంది కార్మికులు, వారి కుటుంబాలకు న్యాయం జరిగేందుకు అండగా నిలిచిన సీతక్క ఫ్యాక్టరీని పునరుద్ధరించేందుకు చేస్తున్న కృషిపట్ల ఏజెన్సీ ప్రాంత ప్రజలు, నిరుద్యోగ యువకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మేడారం డైవర్షన్ రోడ్ల పరిశీలన


కొండాయి వద్ద తాత్కాలిక రోడ్డును పరిశీలిస్తున్న పీఓ అంకిత్


ఇసుక లెవలింగ్ పనులు పరిశీలిస్తున్న పీఓ

ఏటూరునాగారం: ఫిబ్రవరిలో జరిగే మేడారం సమ్మక్క–సారలమ్మ జాతరకు ప్రైవేట్ వాహనాల్లో వచ్చే భక్తుల కోసం రూట్ మ్యాప్‌ను ఐటీడీఏ పీఓ అంకిత్ పరిశీలించారు. సోమవారం మండలంలోని దొడ్ల, కొండాయి, ఊరట్టం వెళ్లే రోడ్లను అధికారులతో కలిసి ఆయన సందర్శించారు. ఏటూరునాగారం మండలంలోని దొడ్ల నుంచి కొండాయి, మల్యాల మీదుగా వెళ్లే దారిలో ఉన్న జంపన్నవాగు తాత్కాలిక కాజ్‌వే, కొండాయి నుంచి ఊరట్టం వెళ్లే దారిలోని కొంద్రేడు కాజ్‌వేను పీఓ తనిఖీ చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని ములుగు వైపు నుంచి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలు, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం వైపు నుంచి అధిక సంఖ్యలో ప్రైవేట్ వాహనాలకు ఈ రోడ్డు ఉపయోగపడనుంది. అందుకోసం దొడ్ల, కొండాయి వంతెన వద్ద రోడ్డును మరింత పటిష్ట పర్చాలన్నారు. ఇప్పుడు ఉన్న ఇసుక బస్తాలు కాకుండా అదనంగా ఇసుక బస్తాలను వేసి రోడ్డు కోతకు గురికాకుండా చూడాలన్నారు. జాతర సమయంలో నీరు మరింత వచ్చే అవకాశం ఉందని, దానికి అనుగుణంగా కొంద్రేడు, కొండాయి కాజ్‌వేలు సిద్ధం చేయాలని డీఈఈ రఘువీర్‌ను ఫోన్‌లో పీఓ ఆదేశించారు. కొండాయి నుంచి ఊరట్టం వరకు ఆర్అండ్‌బీ శాఖ ద్వారా మట్టి పనులు, పిచ్చి మొక్కల తొలగింపు, గ్యాప్‌లో గ్రావెల్ పూడ్చివేత, లెవలింగ్ పనులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ వసంతరావు, ఎస్ఓ రాజ్‌కుమార్ సిబ్బంది ఉన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం జాతర పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఐటీడీఏ పీఓ అంకిత్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మేడారం, రెడ్డిగూడెం గ్రామాల్లో ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్(మిషన్ భగీరథ) పనులను సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో కలిసి సోమవారం ఆయన పరిశీలించారు. జంపన్నవాగులో ఇసుక లెవలింగ్, ఇన్‌ఫిల్టరేషన్ బావుల్లో పూడికతీత పనులను పర్యవేక్షించారు. మంత్రి ఆదేశాల మేరకు పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. ఏటూరునాగారం గోదాం నుంచి మేడారం వరకు బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ మెటీరియల్ డంపింగ్‌ను పరిశీలించి, నేటినుంచి బ్యాటరీ ఆఫ్ ట్యాప్‌ల ఏర్పాటు చేయాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. రెడ్డిగూడెంలోని ప్రైవేట్ షెడ్‌లో ఆర్‌డబ్ల్యూఎస్ మెటీరియల్ జీఐ షీట్లు, టాయిలెట్ మెటీరియల్, డోర్ ఫ్రేమ్‌లు, కుళాయిల బ్యాటరీ తదితర డంపింగ్‌ను పరిశీలించి, మెటీరియల్ డంపింగ్ పూర్తి చేసి పనులు ప్రారంభించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్లను ఆదేశించారు. మ్యూజియం ఆవరణను పరిశుభ్రంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీఓ వసంతరావు, స్టాటిస్టికల్ ఆఫీసర్ రాజ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ శంకర్, ఈఈలు సుభాష్, నారాయణ, డీఈలు సతీష్, సదయ్య ఉన్నారు.

బైక్‌ను ఢీకొన్న ట్రాక్టర్

- ప్రమాదంలో బాలిక మృతి
- పోలీస్ స్టేషన్ ఎదుట బంధువుల ఆందోళన


పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న బంధువులు


బకాటి కీర్తన (ఫైల్)

వేలేరు : ట్రాక్టర్.. బైక్ ఢీకొని బాలిక మృతిచెందిన ఘటన మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానిక సీఐ శ్రీధర్‌రావు, ఎస్సై డి.హరిత తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మసాగర్ మండలంలోని దేవునూర్ గ్రామానికి చెందిన బకాటి రాజు బంధువుల ఇంటికి ఓ ఫంక్షన్ నిమిత్తం సిద్దిపేట జిల్లా అక్కన్నపేటకు ఆదివారం వెళ్లి సోమవారం సాయంత్రం తిరిగి వస్తున్నారు. ఇదే క్రమంలో కొన్నె సదానందం తన ట్రాక్టర్‌లో నారాయణగిరి నుంచి కంకర లోడ్‌తో వేలేరుకు వస్తున్నాడు. ఈ క్రమంలో మూలమలుపు వద్దకు రాగానే గమనించని ట్రాక్టర్ డ్రైవర్ ఎదురుగా వస్తున్న బైక్ హ్యాండిల్‌కు ట్రాక్టర్ తగలడంతో బైక్‌పై వెళ్తున్న ముగ్గురు ఎడమవైపు పడగా బాలిక బకాటి కీర్తన(10) ఎగిరి ట్రాక్టర్ ట్రాలీ టైర్ కింద పడటంతో అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ట్రాక్టర్ డ్రైవర్‌ను పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. అలాగే బంధువులు కూడా బాలిక మృతదేహన్ని పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి తమకు న్యాయం చేయాలని ఆందోళన చేపట్టారు. పోలీసులు ఇరువర్గాలను సముదాయించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎంజీఎంకు తరలించారు.

మహిళా ‘లా’ గురుకుల కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

- ఉమ్మడి వరంగల్‌జిల్లా బీసీ గురుకుల ఆర్‌సీఓ మనోహర్‌రెడ్డి

విద్యారణ్యపురి : హనుమకొండ జిల్లాలోని కాజీపేటలోని మహాత్మా జ్యోతిరావు పూలే సంక్షేమ గురుకుల మహిళా లా(న్యాయ కళాశాల) కళాశాలలో 2023–2024 విద్యాసంవత్సరంలో ఐదేళ్ల లా, ఇంటిగ్రేటెడ్ లా కోర్సుల్లో ఈనెల 10 వరకు స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియను నిర్వహిస్తున్నామని ఉమ్మడి వరంగల్ జిల్లా బీసీ గురుకులాల ఆర్‌సీఓ మనోహర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 2023 లాసెట్‌లో ఉత్తీర్ణులై ఇంటర్ పూర్తిచేసుకున్న మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ మహిళా అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. లాసెట్ ప్రాసెసింగ్ ఫీజు రూ.800 , ఎస్సీ, ఎస్టీలకు రూ.500 చెల్లించాల్సి ఉంటుందన్నారు. అర్హత పత్రాలతోపాటు, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు సమర్పించాల్సి ఉంటుందన్నారు. అడ్మిషన్లు పొందిన వారు గురుకులంలోనే ఉండాల్సి ఉంటుందన్నారు. అడ్మిషన్ల సమాచారం కోసం 99088 48929, 93966 00601, 98495 85458 నంబర్లలో సంప్రదించాలన్నారు.

తమాషా చేస్తున్నారా?

- ఏఈపై ఎస్ఈ ఆగ్రహం
- గండి పూడ్చివేయాలని ఆదేశం


గండిపడిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్ఈ

హసన్‌పర్తి: ‘తమాషా చేస్తున్నారా? విధులు సక్రమంగా నిర్వహించండి’ అని వరంగల్ సర్కిల్ ఎస్ఈ సుధాకర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ‘ఎస్సారెస్పీ కాల్వకు గండి’ శీర్షికన ‘సాక్షి’లో సోమవారం ప్రచురితమైన కథనానికి నీటి పారుదలశాఖ సర్కిల్ ఎస్ఈ సుధాకర్‌రెడ్డి స్పందించారు. ఈమేరకు సోమవారం గండి పడిన డీబీఎం–22/బీ ప్రాంతాన్ని సందర్శించారు. ఆయకట్టు రైతులతో మాట్లాడారు. ఏడాదిన్నర క్రితం గండి పడిందని, ఈవిషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. స్పందించలేదని రైతులు ఎస్ఈ దృష్టికి తీసుకెళ్లారు. ఎస్సారెస్పీ జలాలు విడుదలైనప్పుడు నీరు వృథాగా పోతోందని రైతులు తెలిపారు. దీంతో దిగువ ప్రాంత రైతులకు సాగునీరు అందడం లేదని ఎస్ఈకి చెప్పారు.

ఏఈపై ఆగ్రహం

ఈవిషయమై ఎస్ఈ సుధాకర్‌రెడ్డి స్థానిక ఏఈ భాస్కర్‌రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై అసహనం వ్యక్తం చేశారు. నీళ్లు విడుదలైనప్పుడు కాల్వలు పర్యవేక్షిస్తున్నారా? ఏడాదిన్నర క్రితం గండి పడితే ఈవిషయాన్ని తన దృష్టికి ఎందుకు తీసుకురాలేదని ప్రశ్నించారు. మరమ్మతులు చేశానని ఏఈ చెప్పడంతో గండి కొట్టిన వారిపై ఎందుకు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయలేదని ప్రశ్నించారు. ఈవిషయమై ఏఈ భాస్కర్‌రెడ్డి నుంచి ఎలాంటి సమాధానం రాలేదు.

త్వరగా పనులు పూర్తి చేయండి

కాల్వకు ఏర్పడిన గండిని పూడ్చి వేయాలని ఎస్ఈ ఆదేశించారు. పనులు వేగవంతంగా చేపట్టాలని ఆదేశించారు. ప్రస్తుతం తాత్కాలికంగా పనులు చేపట్టాలని, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈఈ సీతారాంనాయక్, డీఈఈ రవీందర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

ఉమ్మడి జిల్లాలో సోమవారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. జనగామ జిల్లా పాలకుర్తి మండలానికి చెందిన ఓ మిషన్‌భగీరథ కూలీ విద్యుదాఘాతంతో, మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలానికి చెందిన వృద్ధుడు బావిలో పడి, హనుమకొండ జిల్లా కమలాపురం మండలానికి చెందిన మత్స్య కార్మికుడు చేపల వేటకు వెళ్లి నీట మునిగి మృతి చెందారు.

విద్యుదాఘాతంతో మిషన్‌భగీరథ కూలీ..


సాంబరాజు(ఫైల్)

పాలకుర్తి టౌన్ : విద్యుదాఘాతంతో కూలీ మృతి చెందిన సంఘటన జనగామ జిల్లా పాలకుర్తి మండలం కోతులబాధ గ్రామంలో సోమవారం జరిగింది. ఎస్సై తాళ్ల శ్రీకాంత్, బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్టేషన్ ఘన్‌పూర్ మండలం మీదికొండ గ్రామానికి చెందిన శివరాత్రి సాంబరాజు(30) పదేళ్ల నుంచి మిషన్‌భగీరథలో రోజు వారి కూలీగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో గ్రామంలో మెయిన్ పైపులైన్ లీకేజీ కావడంతో మరమ్మతు చేస్తుండగా, పొక్లెయినర్ సాయంతో గుంతను తీస్తుండగా సాంబరాజు పైపులైన్ అతికిస్తున్నాడు. కాగా పొక్లెయినర్ బకెట్‌కు పైన విద్యుత్ తీగలు తగలడంతో పక్కనే ఉన్న సాంబరాజు పొక్లెయినర్‌కు తగిలి ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. స్థానికులు మృతదేహాన్ని పాలకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకురావడంతో బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. మృతుడికి భార్య పుష్పలత, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బావిలో పడి వృద్ధుడు..


పెద్ద భిక్షం(ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : బావిలో పడి వృద్ధుడు మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని కొత్త కలెక్టరేట్ కార్యాలయ సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు.. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం బొద్దుగొండ గ్రామానికి చెందిన అప్పాల పెద్ద భిక్షం(55) ఈనెల 5వ తేదీన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో కొత్త కలెక్టరేట్ కార్యాలయ సమీపంలోని గుడిసెల వద్దకు వెళ్తున్న అని ఇంటి వద్ద చెప్పి బయటికి వెళ్లాడు. ఆ రోజు నుంచి మళ్లీ ఆయన ఇంటికి తిరిగి రాలేదు. దీంతో భిక్షం ఆచూకీ కోసం బంధువులు, తెలిసిన వారి వద్ద వెతికిన ఎలాంటి సమాచారం లేదు. కాగా భిక్షం కుటుంబ సభ్యులు పెద్దమనుషుల సమక్షంలో మాట్లాడదామని అనుకుని వేచిఉండగా అక్కడే సమీపంలోని బావిలో ఓ వ్యక్తి మృతిదేహం నీటిపై తెలియాడుతూ కనిపించిందని సమాచారం అందింది. దీంతో వారు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా టౌన్ ఎస్సై తేజావత్ రామారావు సంఘటన స్థలాన్ని చేరుకుని విచారించారు. బావిలో గల మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఉపేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ హెడ్ కానిస్టేబుల్ తుమ్మల లక్ష్మయ్య కేసు నమోదు చేశారు.

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు..


సాగర్ (ఫైల్)

కమలాపూర్: మండలంలోని శనిగరం గ్రామానికి చెందిన మత్స్యకారుడు బండి సాగర్ (31) ఆదివారం చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు చెక్‌డ్యాంలో పడి మృతి చెందినట్లు పోలీసులు సోమవారం తెలి పారు. చెక్‌డ్యాంలో దిగి చేపలు పడుతున్న క్రమంలో సాగర్ ప్రమాదవశాత్తు నీట మునిగి ఊపిరాడక మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. సాగర్ తండ్రి సాంబయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ వి.కుమారస్వామి తెలిపారు.